# సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

శనివారం । 18 । ఫిబ్రవరి । 2023






### కలెక్టర్ దంపతుల పూజలు
నెల్లూరు (బృందావనం): నెల్లూరులోని రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానంలో శుక్రవారం రాత్రి కలెక్టర్ చక్రధర్‌బాబు దంపతులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మీనాక్షీ సుందరేశ్వర స్వామి వారి చప్పర ఉత్సవం వైభవంగా జరిగింది.



### బంగారం ధరలు

| | |
|---|---|
| 24 క్యారెట్లు (10 గ్రాములు) | రూ.57,930 |
| 22 క్యారెట్లు ఆర్నమెంట్ (1 గ్రా) | రూ.5,174 |
| 3 శాతం జీఎస్టీతో | రూ.5,329 |
| నవర (8 గ్రా) | రూ.42,632 |

### వాతావరణం
గరిష్ఠం/కనిష్ఠం
31.5 /22.2

జిల్లాలో రోజు రోజుకు పగటి ఉష్ణోగ్రతలు గణనీయంగా పెరుగుతున్నాయి. రెండు సెంటీ గ్రేడ్ల మేర ఉష్ణోగ్రతలు పెరగడంతో వేడి వాతావరణం ఉంది. గాలిలో తేమ 62 శాతం ఉంది.

# పకడ్బందీగా ఇంటర్ ప్రాక్టికల్స్

## ఏర్పాట్లు పూర్తి చేసిన బోర్డు అధికారులు

- ఈనెల 20 నుంచి వచ్చే నెల 7వ తేదీ వరకు
- ఒకేషనల్‌కు 33, జనరల్‌కు 142 సెంటర్ల ఏర్పాటు
- ప్రాక్టికల్స్‌కు హాజరుకానున్న 33,152 మంది విద్యార్థులు
- నాన్ జంబ్లింగ్ విధానంలో పరీక్షలు

నెల్లూరు (టౌన్): ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సర విద్యార్థులకు ప్రాక్టికల్స్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించనున్నారు. ఇప్పటికే అన్ని ఏర్పాట్లు ఇంటర్ బోర్డు అధికారులు పూర్తి చేశారు. పరీక్షలను నాన్ జంబ్లింగ్ విధానంలో నిర్వహించనున్నారు. సెల్ఫ్ సెంటర్లలో ప్రాక్టికల్స్ జరుగుతుండడంతో అన్ని సెంటర్లలో సీసీ కెమెరాలు ఏర్పాట్లు చేసే విధంగా అధికారులు చర్యలు తీసుకున్నారు. ప్రాక్టికల్స్ ఒకేషనల్, జనరల్ విద్యార్థులకు జరగనున్నాయి. జిల్లా వ్యాప్తంగా మొత్తం 5 విడతల్లో ప్రాక్టికల్స్‌ను నిర్వహించనున్నారు. పరీక్షలు ఈ నెల 20 నుంచి ప్రారంభమై వచ్చే నెల 7వ తేదీన ముగియనున్నాయి. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు రెండు విడతల్లో ప్రాక్టికల్స్ జరగనున్నాయి. పరీక్షల నిర్వహణకు మొత్తం 90 మంది ఎగ్జామినర్లను నియమించనున్నారు. విద్యార్థులు ఫీజు చెల్లించలేదన్న కారణంగా హాల్ టికెట్లు ఇవ్వకుంటే ఫిర్యాదు చేసేందుకు టోల్ ఫ్రీ నంబర్‌ను ఏర్పాటు చేశారు. ఈ నంబర్‌కు ఫిర్యాదు చేస్తే సంబంధిత కళాశాల యాజమాన్యంపై ఇంటర్‌బోర్డు అధికారులు చర్యలు తీసుకోనున్నారు.

**ప్రాక్టికల్స్‌కు 33,152 మంది**

ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సర ప్రాక్టికల్స్ పరీక్షలకు జిల్లా వ్యాప్తంగా మొత్తం 33,152 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. వీరిలో ఒకేషనల్ ప్రథమ సంవత్సరానికి సంబంధించి 1,575 మంది, ద్వితీయ సంవత్సరానికి సంబంధించి 1,599 మంది కలిపి మొత్తం 3,174 మంది హాజరుకానున్నారు. జనరల్‌కు సంబంధించి ఎంపీసీ 15,367 మంది, బైపీసీ 4,611 మంది కలిపి మొత్తం 19,978 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. ఒకేషనల్ విద్యార్థులకు ఈనెల 20వ తేదీ నుంచి వచ్చేనెల 7వ తేదీ వరకు, జనరల్ విద్యార్థులకు ఈ నెల 26 నుంచి వచ్చే నెల 7వ తేదీ వరకు ప్రాక్టికల్స్ జరగనున్నాయి. ఒకేషనల్ విద్యార్థులకు 3 విడతలు, జనరల్ విద్యార్థులకు 2 విడతలు కలిపి మొత్తం 5 విడతల్లో ప్రాక్టికల్స్‌ను నిర్వహించనున్నారు. ఒకేషనల్ విద్యార్థులకు 33 సెంటర్లు, జనరల్ విద్యార్థులకు 142 సెంటర్లుల్లో ప్రాక్టికల్స్ పరీక్షలను నిర్వహించనున్నారు.



ప్రాక్టికల్స్ పరీక్షలకు హాజరైన విద్యార్థులు (ఫైల్)



### సీసీ కెమెరాల పర్యవేక్షణలో ప్రాక్టికల్స్
ఇంటర్ ప్రాక్టికల్స్‌ను పకడ్బందీగా నిర్వహించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. ఈ విద్యా సంవత్సరం సెల్ఫ్ సెంటర్లల్లో నాన్ జంబ్లింగ్ పద్ధతిలో ప్రాక్టికల్స్ నిర్వహించాలని రాష్ట్ర ఇంటర్‌బోర్డు అధికారులు నిర్ణయం తీసుకున్నారు. ఈ నేపథ్యంలో ప్రాక్టికల్స్ జరుగు ఆయా సెంటర్లలో సీసీ కెమెరాలు బిగించనున్నారు. సీసీ కెమెరాల పర్యవేక్షణలో ప్రాక్టికల్స్ పరీక్షలు జరగనున్నాయి. ప్రాక్టికల్స్‌లో ఎలాంటి అవకతవకలకు పాల్పడినా బోర్డు నిబంధనలు ప్రకారం ఆయా కళాశాలల యాజమాన్యం, ఎగ్జామినర్లపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని జిల్లా ఇంటర్‌బోర్డు అధికారులు హెచ్చరిస్తున్నారు.

### హాల్ టికెట్‌కు టోల్‌ఫ్రీ నంబర్ ఏర్పాటు
అటెండెన్స్ నిబంధనల ప్రకారం విద్యార్థులందరికీ ఆయా కళాశాలల ప్రిన్సిపల్స్ హాల్ టికెట్లు ఇవ్వాలని ఇంటర్ బోర్డు సూచించింది. దీనికి భిన్నంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. జిల్లాలో ఎక్కువ కళాశాలల యాజమాన్యాలు విద్యార్థులు ఫీజు చెల్లించలేదన్న కారణంతో హాల్ టికెట్లను నిరాకరిస్తున్నారు. పెండింగ్ ఫీజు చెల్లిస్తేనే హాల్ టికెట్ ఇస్తామని చెబుతున్నారు. ఈ నేపథ్యంలో విద్యార్థులు ఇబ్బందులు పడకుండా ఉండేందుకు రాష్ట్ర ఇంటర్‌బోర్డు అధికారులు టోల్‌ఫ్రీ నంబర్‌ను ఏర్పాటు చేశారు. 1800 425 7635 నంబరుకు ఫిర్యాదు చేస్తే సమస్యలను పరిష్కరించనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ నంబరుతో పాటు జిల్లాలో 0861-2320312 నంబర్‌ను ఏర్పాటు చేశారు. హాల్ టికెట్లు, ప్రాక్టికల్స్ సమయంలో ఇబ్బందులు, సమస్యలపై ఈ నంబర్‌కు ఫిర్యాదు చేయాలని జిల్లా ఇంటర్‌బోర్డు అధికారులు తెలిపారు.

### సీసీ కెమెరాలు తప్పనిసరి


ప్రాక్టికల్స్ జరుగుతున్న ప్రతి సెంటర్‌లో సీసీ కెమెరాలు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలి. సీసీ కెమెరాల్లో ప్రాక్టికల్స్ పరీక్షల నిర్వహణను రాష్ట్ర ఇంటర్‌బోర్డు అధికారులు పర్యవేక్షించనున్నారు. ప్రతి రోజూ రికార్డు అవుతుంది. ఫిర్యాదు వచ్చిన కళాశాలపై సీసీ కెమెరాల ద్వారా పరిశీలించి చర్యలు తీసుకుంటారు. వారం రోజుల నుంచి అన్ని సెంటర్లలో సీసీ కెమెరాల ఏర్పాటును పరిశీలిస్తున్నాం. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. విద్యార్థులు ఎక్కువగా ఉన్న 3 సెంటర్లలో ల్యాబ్‌లను అదనంగా పెట్టించాం.

– వరప్రసాదరావు, ఆర్‌ఐఓ

## న్యూస్‌రీల్

### గుండు సూదిపై శివలింగం



ముత్తుకూరు: మండలంలోని బ్రహ్మదేవి జెడ్పీ హైస్కూల్ 9వ తరగతి విద్యార్థిని డీ హిమ శర్వాణి శుక్రవారం గుండు సూదిపై చాక్ పీస్‌తో తయారు చేసిన శివలింగాన్ని రూపొందించారు. శనివారం మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఈ సూక్ష్మ కళారూపాన్ని ఆవిష్కరించింది.

### టిడ్కో గృహాలకు త్వరితగతిన రుణ మంజూరు


మాట్లాడుతున్న మెప్మా పీడీ రవీంద్ర

నెల్లూరు సిటీ: టిడ్కో గృహ లబ్ధిదారులకు రుణ మంజూరును త్వరితగతిన పూర్తి చేయాలని మెప్మా పీడీ రవీంద్ర సూచించారు. మెప్మా కార్యాలయంలో శుక్రవారం సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రవీంద్ర మాట్లాడుతూ బ్యాంక్ మేనేజర్లతో సమన్వయం చేసుకుని లబ్ధిదారులకు గృహ రుణం మంజూరు చేయించాలన్నారు. సంఘాలు, సమాఖ్యలో బలోపేతానికి కృషి చేయాలన్నారు. తోడు, స్వనిధి, పథకాలు అమలు సక్రమంగా జరగాలన్నారు. ఈ సమావేశంలో ఏఓ ప్రసాద్, ఐబీ అంకయ్య, ఎల్‌హెచ్ సుధాకర్, బీఎల్ సురేంద్ర, సీఎంఎంలు కాంతయ్య, భారతి, ఇంగర్‌సెల్ బాబు, ఏఎల్‌ఎఫ్ అధ్యక్షుడు శాంతి, మాధవి, సుభాషిణి, సీఓలు పాల్గొన్నారు.

### స్థానిక సంస్థల ఎమ్మెల్సీకి నామినేషన్లు నిల్
నెల్లూరు (అర్బన్): జిల్లాలో స్థానిక సంస్థల ఎమ్మెల్సీకి జరగబోయే ఎన్నికలకు సంబంధించి రెండో రోజు శుక్రవారం సైతం ఎలాంటి నామినేషన్లు దాఖలు కాలేదు. కలెక్టరేట్‌లోని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జాయింట్ కలెక్టర్ కూర్మనాథ్ తమ చాంబర్‌లో నామినేషన్లు దాఖలు చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. శనివారం, ఆదివారం సెలవులు కావడంతో ఆ రెండు రోజులు కూడా నామినేషన్లు వేసేందుకు వీలులేదు. సోమవారం కొంత మంది ఇండిపెండెంట్లుగా నామినేషన్ వేసే అవకాశం ఉంది.

### సోమశిలలో 64.314 టీఎంసీలు


సోమశిల: జలాశయంలో శుక్రవారానికి 64.314 టీఎంసీలు ఉన్నాయి. జలాశయానికి ఎగువ నుంచి 559 క్యూసెక్కుల నీటి ప్రవాహం వస్తోంది. పెన్నార్‌డెల్టాకు 1,920 క్యూసెక్కులు, ఉత్తరకాలువకు 730, దక్షిణకాలువకు 320, కండలేరుకు 50 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నా రు. నగటున 337 క్యూసెక్కులు ఆవిరవుతోంది.

# చక్ర బంధంలో సింహపురి!



- జిల్లాలో భారీగా పెరిగిన వాహనాల వినియోగం
- బైక్‌లు, కార్లు ఉపయోగించే వారు మూడేళ్లలో రెట్టింపు
- నెల్లూరు నగరంలో 1.42 లక్షల ద్విచక్ర వాహనాలు, 18,500 కార్లు
- నగరంలో పెరుగుతున్న ట్రాఫిక్ కష్టాలు

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: జిల్లాలో కొత్తగా రోడ్డెక్కె వాహనాల సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. కోవిడ్ మహమ్మారి విజృంభించిన తర్వాత ప్రజల ప్రయాణ శైలిలో మార్పు వచ్చింది. దీనికి తోడు వ్యవసాయం యాంత్రీకరణ కావడంతో గ్రామీణ ప్రాంతాలలో ప్రతిదీ వాహనాలతోనే వ్యవసాయం చేస్తున్నారు. ఫలితంగా గత కొన్నేళ్లుగా వాహన అమ్మకాల్లో వృద్ధి కనిపిస్తోంది. మరో వైపు నెల్లూరు నగరంలో ఇబ్బడిముబ్బడిగా రహదారులపైకి వస్తున్న వాహనాలతో ట్రాఫిక్ ఇక్కట్లు పెరిగిపోతున్నాయి. గతేడాదిలో నగరంలో దాదాపు 5 వేల ద్విచక్ర, నాలుగు చక్రాల వాహనాలు కొత్తగా రోడ్డెక్కాయి. నెల్లూరు నగరంలో వాహనాల వినియోగం బాగా పెరిగిపోయింది. మూడేళ్లలో కార్లు, బైకులు వినియోగించే వారి సంఖ్య రెట్టింపైంది. 2015లో నగరంలో 30,613 మంది ద్విచక్ర వాహనదారులుంటే.. 2017లో ఆ సంఖ్య 54,345కు చేరింది. 2020కి ఆ సంఖ్య 1.42 లక్షలకు చేరుకుంది. అలాగే 2015లో కార్లు వినియోగించే వారు 5,214 మంది ఉంటే.. 2017లో ఆ సంఖ్య 11,125కు చేరుకుంది. 2022 ఏడాదికి 18,500కు చేరుకుంది. అదే సమయంలో ఆటో రిక్షాలు 2017లో 10,112 ఉంటే.. 2022 చివరిలో 36 వేలకు చేరుకున్నాయి. అలాగే సరుకు రవాణా వాహనాలు, విద్యాసంస్థల బస్సులు పెరిగిపోయాయి. వ్యక్తిగత వాహనాల వినియోగం పెరిగినట్లుగా ఇటీవల కొన్ని సంస్థలు చేపట్టిన సర్వేలో వెల్లడైంది. పెరుగుతున్న వాహనాల సంఖ్యకు అనుగుణంగా దశాబ్దాల నాటి రోడ్లు విస్తరణ చేయకపోవడంతో ప్రధాన కూడళ్లలో వాహనాల కదలిక నత్తనడకన సాగుతోంది. నెల్లూరు జనాభా 2004లో 4,04,775 మంది ఉండగా 2009 నాటికి 5,58,547లకు ప్రస్తుతం 8.5 లక్షలకు చేరుకుంది.

### ప్రధాన కూడళ్లలో పరీక్షే..
నగరంలో రోజు రోజుకు పెరుగుతున్న వాహనాలతో నగరవాసులు నిత్యం ట్రాఫిక్ కష్టాలతో అల్లాడిపోతున్నారు. నగరంలో ఫ్లైఓవర్ వంతెన పనులు, రైల్వే వంతెన పనులు జరుగుతుండడంతో ట్రాఫిక్ కష్టాలు వెంటాడుతున్నాయి.

# స్క్రాప్ కింద పాత వాహనాల వేలం

- వైద్యశాఖకు రూ.12.30 లక్షల రాబడి

నెల్లూరు (అర్బన్): మరమ్మతులు చేసినప్పటికీ ఉపయోగపడని కాలం తీరిన జీపులు, వ్యాన్‌లు తదితర 23 వాహనాలకు జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ స్క్రాప్ కింద విక్రయించేందుకు ఈ-వేలం నిర్వహించింది. ఏడు వాహనాలకు సంబంధించి రూ.12,30,245 వేలంలో దక్కించుకున్నారు. ఈ మొత్తం వైద్యశాఖ ఖజానాకు జమ అయింది.

### ప్రభుత్వ భూమి కబ్జాపై కలెక్టర్ సీరియస్
- అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్న వారిపై క్రిమినల్ కేసులు

సీతారామపురం: సీతారామపురంలోని సర్వే నంబర్ 1లో మేత పోరంబోకు భూమి అక్రమ రిజిస్ట్రేషన్‌పై కలెక్టర్ సీరియస్ అయ్యారు. రూ.కోట్ల విలువ చేసే భూమిని ఇద్దరు వ్యక్తులు తప్పుడు పత్రాల ద్వారా అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకున్న వైనంపై స్థానిక తహసీల్దార్ ద్వారా పూర్తిస్థాయి విచారణ చేయించారు. అది పక్కా ప్రభుత్వ భూమిగా నిర్ధారించి ఉన్నతాధికారులకు నివేదిక ఇవ్వడంతో అక్రమార్కులపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని ఆదేశించారు. దీంతో అక్రమాలకు పాల్పడిన వి.సూర్యకుమారి, ఏ శ్రీనివాస్‌పై తహసీల్దార్ షాజియా పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ కిషోర్ బాబు తెలిపారు.

### రామతీర్థం పీహెచ్‌సీకి మొదటి ర్యాంక్


రామతీర్థం పీహెచ్‌సీ

నెల్లూరు(అర్బన్): జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ పరిధిలోని విడవలూరు మండలం రామతీర్థం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి జిల్లాలో మొదటి ర్యాంక్‌ను శుక్రవారం ప్రభుత్వం ప్రకటించింది. వలేటివారిపాళెం పీహెచ్‌సీకి రెండో ర్యాంక్, గిద్దలూరు పీహెచ్‌సీకి మూడో ర్యాంక్ లభించింది. మానవ వనరులు, మౌలిక వసతుల కల్పన, ఓపీ సంఖ్య, ఇన్‌పేషెంట్లు, ల్యాబ్ పరీక్షలు, ఐయూసీడీ, పారిశుధ్య పరిరక్షణ తదితర పలు అంశాలను కొలమానంగా తీసుకుని జనవరి నెలకు సంబంధించి ఈ ర్యాంక్‌ను రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. జిల్లాలో 52 పీహెచ్‌సీలు, 29 అర్బన్ హెల్త్ సెంటర్లు ఉండగా రామతీర్థం పీహెచ్‌సీ డాక్టర్లు, సిబ్బంది అందించిన వైద్య సేవలకు ప్రథమ ర్యాంకు దక్కింది. దీంతో వైద్యశాఖాధికారి పెంచలయ్య రామతీర్థం పీహెచ్‌సీ డాక్టర్లను అభినందించారు. ఈ సందర్భంగా రామతీర్థం పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అమరేంద్రనాథ్‌రెడ్డి మాట్లాడుతూ మొదటి ర్యాంకును కాపాడుకుంటూ తమ ఆస్పత్రి ద్వారా మరిన్ని మెరుగైన వైద్యసేవలందిస్తామని తెలిపారు.

# విజ్ఞాన భాండాగారం

- వందేళ్ల విద్యాసేవలో వేంకట్రామ అండ్ కో
- రాష్ట్రంలోనే తొలి ఆధ్యాత్మిక పుస్తకాల నెలవు
- విద్య, సామాజిక సేవలకు గుర్తింపు


గణతంత్ర దినోత్సవం రోజున కలెక్టర్ చక్రధర్‌బాబు చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందుకుంటున్న శ్రీనివాసరావు

నెల్లూరు(బృందావనం): నెల్లూరు నగరంలోని వేంకట్రామ బుక్‌షాప్‌కు వందేళ్లకు పైగా చరిత్ర ఉంది. కేవలం పుస్తక విక్రయానికే పరిమితం కాకుండా సమాజసేవ చేస్తుంటారు. కోవిడ్ సమయంలో మెడికల్ కిట్లు పంపిణీ చేశారు. గణతంత్ర దినోత్సవం రోజున వారికి ప్రభుత్వం నుంచి గుర్తింపు లభించింది.

**వందేళ్ల క్రితం**

జిల్లాలో పాత తరం నుంచి నేటి తరం వరకు శ్రీవేంకట్రామ బుక్ షాప్ అంటే తెలియని వారే ఉండరు. రాజమండ్రికి చెందిన శ్రీపతి జానకి రామయ్య ఉద్యోగరీత్యా నెల్లూరుకు వచ్చారు. 1910–15 సంవత్సరాల మధ్య కాలంలో సంతపేట కూడలిలో ఆరణికందప్ప మేస్త్రీ సత్రం ప్రాంగణంలో ఐదుగురు సిబ్బందితో పుస్తక దుకాణాన్ని ప్రారంభించారు. రాష్ట్రంలో ఐఎస్‌ఓ గుర్తింపు పొందిన తొలిదుకాణం కావడం విశేషం. సుమారు 70 సంవత్సరాలకు పైగా బుక్ షాప్‌ను నిర్వహించారు. వయోభారంతో ఆయన 1991 జూలై 27న మరణించారు.

**ప్రముఖుల నుంచి ప్రశంసలు**

జానకిరామయ్య 60 ఏళ్ల క్రితమే సొంత నిధులతో ఆధ్యాత్మిక, సామాజిక సేవ, విద్యాభివృద్ధి తదితర కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. అనేక ప్రభుత్వ రంగ సంస్థలకు, గ్రంథాలయాలకు, విద్యాసంస్థలకు పుస్తకాలను సరఫరా చేసి ప్రత్యేక గుర్తింపు పొందారు. ఎందరో ప్రముఖుల ప్రశంసలందుకున్నారు. ఆయన ఆలిండియా బుక్స్ అండ్ పబ్లిషర్స్ జాతీయ అధ్యక్షుడిగా, అఖిల భారత పుస్తక విక్రేతల సంఘం సభ్యుడిగా వ్యవహరించారు. 1962లో జిల్లా పుస్తక విక్రేతల సంఘాన్ని స్థాపించారు. ప్రస్తుతం జానకిరామయ్య కుమారులు షాపు నిర్వహిస్తున్నారు. వారు తండ్రి బాటలో నడుస్తున్నారు. సేవా కార్యక్రమాలు చేయడంలో ముందంజలో ఉన్నారు. ఆధునికీకరించిన వేంకట్రామ అండ్ కో షాపును గాంధీబొమ్మ సెంటర్ సమీపంలో ఏర్పాటు చేశారు.

**దశాబ్దాల విద్యాసేవకు గుర్తింపు**



74వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ ప్రశంసలందుకోవడం జీవితాంతం గుర్తుండిపోతుంది. రిపబ్లిక్ డే నాడు కలెక్టర్ చక్రధర్ బాబు, జేసీ కూర్మనాథ్‌లు వేంకట్రామ అండ్ కో సంస్థకు ప్రశంసాపత్రం అందజేయడం దశాబ్దాల మా నాన్న, నా అన్నదమ్ముల విద్యా కృషికి గుర్తింపుగా భావిస్తున్నా. సమాజసేవతో పాటు ఆధ్యాత్మిక, విద్య కార్యక్రమాలకు తమ వంతు ఆర్థిక సహకారం అందించడం సంతృప్తిని ఇస్తోంది.

– శ్రీపతి శ్రీనివాసరావు, అధినేత, శ్రీవేంకట్రామ బుక్‌షాప్


గాంధీబొమ్మ వద్ద ఉన్న వేంకట్రామ షాప్

# జాతీయ రహదారిపై సెబ్ తనిఖీలు

- 12 కేజీల గంజాయి స్వాధీనం
- నిందితుడి అరెస్ట్


వివరాలు వెల్లడిస్తున్న ఏఈఎస్ కృష్ణకిశోర్‌రెడ్డి

నెల్లూరు(క్రైమ్): జిల్లా సెబ్ అధికారిణి కె.శ్రీలక్ష్మి ఆదేశాల మేరకు అధికారులు జాతీయ రహదారిపై తనిఖీలు చేపట్టి 12 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం సాయంత్రం స్థానిక సెబ్ నెల్లూరు-1 స్టేషన్‌లో ఏఈఎస్ ఎస్.కృష్ణకిశోర్‌రెడ్డి వివరాలను వెల్లడించారు. శుక్రవారం సెబ్ నెల్లూరు-1, డీఎస్‌ఈఓ పోలీసు టీం ఇన్‌స్పెక్టర్లు కేపీ కిశోర్, హుస్సేన్‌బాషా, ఎస్సైలు బాలకృష్ణ, ఎ.శ్రీనివాసరావు తమ సిబ్బందితో కలిసి బుజబుజనెల్లూరు హైవేపై తనిఖీలు చేపట్టారు. మోటార్‌బైక్‌లో ఇద్దరు వ్యక్తులు ప్లాస్టిక్ బ్యాగ్ పెట్టుకుని అనుమానాస్పదంగా నెల్లూరు వైపు వస్తుండటాన్ని గమనించి ఆపారు. ఇంతలో బైక్‌పై వెనుక కూర్చొన్న వ్యక్తి దూకి పరారయ్యాడు. మరో వ్యక్తి సైదాపురం మండలానికి చెందిన పాతనేరస్తుడు కె.చక్రపాణిని అదుపులోకి తీసుకున్నారు. బ్యాగ్‌లో 12 కేజీల గంజాయిని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నిందితుడిని స్టేషన్‌కు తరలించి విచారించారు. ఇద్దరం గంజాయిని నెల్లూరులో సరఫరా చేసేందుకు వెళ్తున్నామని వెల్లడించడంతో అతడిని అరెస్ట్ చేశారు. స్వాధీనం చేసుకున్న గంజాయి, బైక్ విలువ రూ.1.80 లక్షలు ఉంటుందని ఏఈఎస్ వెల్లడించారు.

**ఇటీవల జైలు నుంచి విడుదల**

చక్రపాణిని గతంలో గంజాయి కేసులో గూడూరు సెబ్ అధికారులు అరెస్ట్ చేసి జైలుకు పంపారు. ఈనెల 2వ తేదీన అతను బయటకు వచ్చాడు. తన మండలానికి చెందిన మరో వ్యక్తితో కలిసి గంజాయి సరఫరా చేయడం ప్రారంభించాడు. పరారీలో ఉన్న వ్యక్తిని త్వరలోనే అరెస్ట్ చేస్తామని ఏఈఎస్ తెలిపారు. సమావేశంలో సిబ్బంది డి.వెంకటేశ్వర్లు, ఎ.శ్రీరాములు, కె.ప్రకాష్ రావు, జి.రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### పక్కాగా ప్రాక్టికల్ పరీక్షలు


మాట్లాడుతున్న డీఆర్వో వెంకటనారాయణమ్మ

నెల్లూరు (అర్బన్): జిల్లాలో ఈ నెల 20 నుంచి ప్రారంభం కానున్న ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పరీక్షలను ఎలాంటి విమర్శలకు తావులేకుండా పక్కాగా నిర్వహించాలని జిల్లా రెవెన్యూ అధికారి వెంకటనారాయణమ్మ సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని డీఆర్వో కార్యాలయంలో ఇంటర్మీడియట్ పరీక్షలపై సమన్వయ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ నెల 20 నుంచి మార్చి 7వ తేదీ వరకు ఒకేషనల్ విద్యార్థులకు, ఈ నెల 26 నుంచి మార్చి 7వ తేదీ వరకు ఎంపీసీ, బైపీసీ విద్యార్థులకు ప్రాక్టికల్ పరీక్షలు జరుగుతాయన్నారు. పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులు కల్పించాలని ఆదేశించారు. పోలీసు, ప్రజారవాణా, మున్సిపల్, వైద్యశాఖాధికారులు తమకు కేటాయించిన విధులను సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు. సమావేశంలో ఆర్ఐఓ వరప్రసాద్, నెల్లూరు నగరపాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ చెన్నుడు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

### విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి

నెల్లూరు(క్రైమ్): ఎలివేషన్ పనులు చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన నెల్లూరులోని మన్సూర్‌నగర్‌లో శుక్రవారం జరిగింది. పోలీసుల కథనం మేరకు.. సీతారామపురం మండలం సంజీవ్‌నగర్‌కు చెందిన టి.రమేష్ (34), శాంతకుమారి దంపతులకు వెంకట సందీప్ అనే కుమారుడు ఉన్నాడు. రమేష్ కుటుంబం కొంతకాలం క్రితం ఉపాధి నిమిత్తం నెల్లూరు నగరానికి వచ్చింది. మన్సూర్‌నగర్‌లోనే అద్దె ఇంట్లో ఉంటున్నారు. రమేష్ బిల్డింగ్ ఎలివేషన్ పనులు చేస్తున్నాడు. శుక్రవారం అదే ప్రాంతంలో ఓ చోట భవనంలో పనులు చేస్తుండగా విద్యుత్ తీగలు తగిలి షాక్‌కు గురయ్యాడు. సహచరులు గుర్తించి అతడిని వెంటనే చికిత్స నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ కొద్దిసేపటికే మృతిచెందాడు. శాంతకుమారి చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. మృతదేహాన్ని మార్చురీకి తరలించి ఇన్‌స్పెక్టర్ ఎ.సురేంద్రబాబు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

### పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు



| | |
|---|---|
| బ్రాయిలర్ (లైవ్) | :103 |
| లేయర్ (లైవ్) | :75 |
| బ్రాయిలర్ చికెన్ | :184 |
| బ్రాయిలర్ స్కిన్‌లెస్ | :204 |
| లేయర్ చికెన్ | :128 |

# ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయానికి సహకరించండి

- ఎమ్మెల్సీ అభ్యర్థి పేర్నాటి


జిల్లా కోర్టు వద్ద న్యాయవాదులతో శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి

నెల్లూరు(లీగల్): తూర్పు రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న తన గెలుపునకు సహకరించాలని పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి న్యాయవాదులను కోరారు. నెల్లూరులోని జిల్లా కోర్టు ప్రాంగణంలో వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ ఆధ్వర్యంలో శుక్రవారం ఏర్పాటు చేసిన న్యాయవాదుల పరిచయ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి తనశక్తి మేర కృషి చేస్తానన్నారు. మొదటి ప్రాధాన్యత ఓటును వేసి, వేయించి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఏపీ బార్ కౌన్సిల్ సభ్యుడు వేనాటి చంద్రశేఖర్‌రెడ్డి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఉమామహేశ్వర రెడ్డి, వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ అధ్యక్షుడు మురళీధర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి సుబ్బారెడ్డి, బార్ అసోసియేషన్ మాజీ ప్రధాన కార్యదర్శి రోజారెడ్డి, స్పెషల్ పీపీలు కుడుముల రవికుమార్, అయ్యప్పరెడ్డి, రమణారెడ్డి, మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిలర్ రంగారావు తదితరులు పాల్గొన్నారు.

# మహిళలకు అండగా న్యాయసేవాధికార సంస్థ

- సీనియర్ సివిల్ జడ్జి శ్రీనివాసులునాయక్


వివరాలు తెలుసుకుంటున్న జడ్జి శ్రీనివాసులునాయక్

నెల్లూరు(అర్బన్): మహిళలు, ఆడపిల్లల సమస్యలను పరిష్కరించేందుకు జిల్లా న్యాయసేవాధికార సంస్థ కృషి చేస్తోందని ఆ సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి శ్రీనివాసులునాయక్ తెలిపారు. జిల్లా జడ్జి యామిని ఆదేశాల మేరకు శుక్రవారం నెల్లూరులోని ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ వద్ద ఉన్న సఖి వన్‌స్టాప్ సెంటర్‌ను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వ్యక్తుల మధ్య వచ్చే గొడవలను కోర్టు ద్వారా పరిష్కరించుకోవాలంటే అధిక కాలం పడుతుందన్నారు. అలాగే సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన పేదలు ఖర్చులు భరించలేకున్నారన్నారు. నిరక్షరాస్యత వల్ల కూడా న్యాయపాలన అందరికీ అందుబాటులో రావడం లేదన్నారు. ఇలాంటి వారి కోసం 39 రాజ్యాంగ అధికరణ ప్రకారం ఉచిత న్యాయ సహాయం అందించేందుకు 1987లో న్యాయసేవాధికార సంస్థను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. లైంగిక వేధింపులకు గురైన వారికి, గృహ హింస బాధితులకు సంస్థ అండగా ఉంటుందన్నారు. నిరుపేద అభాగ్యులకు ప్రభుత్వం తరఫున ఉచితంగా లాయర్‌ను ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. సంస్థ ద్వారా తగిన సూచనలు, సలహాలు అందిస్తామన్నారు. ఈ విషయాలపై ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో ఏఓ షహనాజ్ తదితరులు పాల్గొన్నారు.

# కర్నూలులో ఇద్దరు బాలికల మిస్సింగ్

- సెల్‌ఫోన్ సిగ్నల్స్ ఆధారంగా నిందితుడి గుర్తింపు
- మర్రిపాడు మండలంలో పట్టుకున్న పోలీసులు
- కేసును ఛేదించిన మర్రిపాడు, కర్నూలు పోలీసులు
- తల్లిదండ్రులకు బాలికల అప్పగింత

మర్రిపాడు: కర్నూలుకు చెందిన ఇద్దరు బాలికల మిస్సింగ్ కేసును మర్రిపాడు, కర్నూలు పోలీసులు ఛేదించారు. పోలీసుల కథనం మేరకు.. కర్నూలులోని ఓ కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతున్న ఇద్దరు బాలికలు కనిపించడంలేదని కర్నూలు తాలూకా పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. దీంతో అక్కడి పోలీసులు సాంకేతికత ఆధారంగా అనుమానితుల ఫోన్ నంబర్లను ట్రేస్ చేశారు. సెల్‌ఫోన్ సిగ్నల్స్ లైవ్ లొకేషన్ నెల్లూరు వైపు చూపించాయి. దీంతో పోలీసులు నెల్లూరు ఎస్పీ విజయారావు దృష్టికి తీసుకెళ్లారు. ఆయన వెంటనే స్పందించి తగిన ఆదేశాలు తీసుకోవాలని మర్రిపాడు పోలీసులను ఆదేశించారు. ఈ క్రమంలో గురువారం రాత్రి డీసీపల్లి టోల్‌ప్లాజా వద్ద వాహనాలను తనిఖీ చేస్తున్న ఆత్మకూరు సీఐ నాగేశ్వరరావు, మర్రిపాడు ఎస్సై విశ్వనాథరెడ్డిని కర్నూలు పోలీస్ బృందం కలిసింది. ఇరువురూ కలిసి వాహనాల తనిఖీ ప్రారంభించారు. ఓ లారీని తనిఖీ చేశారు. ఈ నేపథ్యంలో సెల్‌ఫోన్ సిగ్నల్ అక్కడే చూపించింది. దీంతో క్లీనర్ బోనాల సురేష్ ఫోన్ తీసుకుని పరిశీలించగా అతనే నిందితుడని తేలింది. బాలికలు లారీలో లేరు. వారిని కర్నూలులోని ఓ లాడ్జిలో ఉంచినట్లు చెప్పాడు. ఇద్దరు బాలికలను క్లీనర్, మరో వ్యక్తి ప్రేమ పేరుతో మోసం చేసినట్లు గుర్తించారు. వారిని క్లీనర్ లాడ్జీలో ఉంచాడని పోలీసులు తెలుసుకున్నారు. క్లీనర్ కృష్ణపట్నం పోర్టులో లోడింగ్ నిమిత్తం రాగా.. అది పూర్తయ్యాక బాలికలతో వేరే రాష్ట్రానికి వెళ్లిపోవాలనుకుని ప్రణాళిక వేసుకున్నారు. ఇంతలో కేసును ఛేదించారు. అక్కడి పోలీసులకు విషయం చెప్పగా బాలికలను రక్షించి తల్లిదండ్రులకు అప్పగించారు. దీంతో ఆత్మకూరు సీఐ నాగేశ్వరరావు, మర్రిపాడు ఎస్సై విశ్వనాథరెడ్డిని ఎస్పీ సీహెచ్ విజయారావు శుక్రవారం అభినందించారు.

### నిమ్మధరలు (కిలో)

పెద్దవి : రూ.56
సన్నవి : రూ.45
పండ్లు : రూ.20



# ఇంటర్వ్యూకు వెళ్తున్నానని చెప్పి..

- రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్య
- మృతుడు కర్ణాటక వాసి

నెల్లూరు(క్రైమ్): అతను తల్లిపై అలిగి భార్యతో సహా నెల్లూరుకు వచ్చాడు. ముంబైలో ఇంటర్వ్యూకు వెళ్లాలని బావమరిదిని పిలిచి భార్యను అప్పగించాడు. అనంతరం రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. రైల్వే పోలీసులు శుక్రవారం వివరాలు వెల్లడించారు. బెంగళూరు జీవన్‌హళ్లి కాక్స్‌టౌన్‌కు చెందిన పి.శశికుమార్ (32)కు కలువాయి మండలం పల్లెకొండకు చెందిన తన మేనమామ కుమార్తె ప్రమీలతో ఏడాది క్రితం వివాహమైంది. వివాహానంతరం దంపతులు బెంగళూరులో ఉంటున్నారు. శశికుమార్ ఆన్‌లైన్ ట్రేడింగ్‌తోపాటు చిన్నచిన్న పనులు చేస్తుండగా ప్రమీల అక్కడే అధ్యాపకురాలిగా పనిచేస్తోంది. శశికుమార్‌కు అతని తల్లి నడుమ విభేదాలున్నాయి. తరచూ గొడవపడేవారు. ఆ సమయంలో భార్యతో సహా వెళ్లిపోయి కొద్దిరోజుల తర్వాత ఇంటికి వెళ్లేవాడు. రెండురోజుల క్రితం శశికుమార్ తల్లితో గొడవపడ్డాడు. ఆమెపై అలిగి భార్యను తీసుకుని గురువారం సాయంత్రం నెల్లూరుకు వచ్చాడు. ముత్తుకూరు రోడ్డులోని ఓ ప్రైవేట్ కళాశాలలో పనిచేస్తున్న తన బావమరిది కళ్యాణ్‌ను ఆర్టీసీ బస్టాండ్ వద్దకు పిలిపించుకున్నాడు. తాను ముంబైలో ఇంటర్వ్యూకు వెళ్తున్నానని ప్రమీలను ఇంట్లో వదిలిపెట్టాలని సూచించాడు. దీంతో కళ్యాణ్ ఆమెను తీసుకుని ఊరికి బయలుదేరాడు. ఈక్రమంలో శశికుమార్ నెల్లూరు ప్రధాన రైల్వేస్టేషన్‌కు వెళ్లి కొద్దిసేపు కూర్చొన్నాడు. అనంతరం రైలుపట్టాలపై విజయమహల్‌గేటు వైపు నడుచుకుంటూ బయలుదేరాడు. యశ్వంత్‌పూర్–హౌరా ఎక్స్‌ప్రెస్ రైలు రావడాన్ని గమనించి ఎదురెళ్లి దాని కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఘటనా స్థలంలో లభ్యమైన ఆధారాలతో మృతుడిని గుర్తించారు. శశికుమార్ తల్లి, భార్యకు ఫోన్ చేసి సమాచారం అందించారు. శుక్రవారం వారు నెల్లూరుకు చేరుకున్నారు. మృతదేహానికి ప్రభుత్వ వైద్యులు పోస్టుమార్టం నిర్వహించి బాధిత కుటుంబసభ్యులకు అప్పగించారు. హెడ్‌కానిస్టేబుల్ ప్రభాకర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# రోడ్డు ప్రమాదంలో ఒకరి దుర్మరణం

- మృతుడు తిరుపతి వాసి

తోటపల్లిగూడూరు: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన శుక్రవారం సౌలిపేట సమీపంలో జరిగింది. స్థానిక ఎస్సై ఇంద్రసేనారెడ్డి కథనం మేరకు.. తిరుపతి నగరం మల్లగుంట పంచాయతీ రిక్షాకాలనీకి చెందిన శర్వన్ (45) అనే వ్యక్తి టీవీఎస్ ఎక్సెల్‌పై సౌలిపేట నుంచి తోటపల్లిగూడూరు వైపు వస్తున్నాడు. అదే క్రమంలో తోటపల్లిగూడూరు నుంచి సౌలిపేటకు ఇటుకుల లోడుతో ట్రాక్టర్ వచ్చింది. ఆ సెంటర్లో వైన్ షాపు వద్ద ట్రాక్టర్‌ను తప్పించే ప్రయత్నంలో శర్వన్ దాని వెనుక భాగంలో ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో అతను అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న ఎస్సై ఇంద్రసేనారెడ్డి ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని నెల్లూరు జీజీహెచ్‌కి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.